# భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు)
# మధ్య రీజనల్ బ్యూరో

## రాజకీయ అధికారం లేకుండా ఆత్మగౌరవం ఉండదు

## జాతీయ షెడ్యూల్డ్ తెగల గౌరవదినం హిందుత్వ ప్రభుత్వ మోసం తప్ప మరేం కాదు

### పత్రికా ప్రకటన

**తేది: 12 నవంబర్ 2022**

ప్రియమైన మూలవాసీ ప్రజలారా!

తొలుత మనం భారత ప్రభుత్వం, భారత రాజ్యాంగం ఈ దేశ మూలవాసీ ప్రజలను షెడ్యూల్డ్ తెగలనడాన్ని నిర్ద్వంద్వంగా ఖండిద్దాం. ఒక తెగ గుర్తింపు గవర్నర్ సిఫారసులపై రాష్ట్రపతి ఆమోదంపై ఆధారపడి వుండదు. ప్రతి తెగ తన గుర్తింపును, ఉనికిని చారిత్రికంగానే చాటుకుంటుంది. రాజకీయ పార్టీల ఎన్నికల లబ్ది కోసం లేద హిందుత్వ శక్తుల చరిత్ర వక్రీకరణలతో ఈ దేశంలో మూలవాసులు షెడ్యూల్డ్ తెగలుగా గుర్తింపు పొందడాన్ని మా పార్టీ గట్టిగా ఖండిస్తున్నది. వారిని మూలవాసులుగా/ఆదివాసులుగానే గుర్తించాలనీ డిమాండ్ చేస్తున్నది.

15 నవంబర్ బిర్సాముండా జన్మదినాన్ని (1875-1900) గత సంవత్సరం నుండి కేంద్రప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల గౌరవదినంగా పాటిస్తున్నది. ఇలా పాటించడం మనదేశ హిందుత్వ పాలకుల కుట్రలో భాగం తప్ప మరేం కాదు. మన దేశంలో మూలవాసులంతా బిర్సాముండా సహా తమ తెగల సమస్త అమర ప్రజా వీరుల వారసులుగా దోపిడీకి వ్యతిరేకంగా దృఢంగా పోరాడుతున్నారు. ఈ దేశంలోని మూలవాసులు గత దశాబ్దకాలంగా మున్నెన్నటికన్నా అధికంగా తమ మనుగడ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారు తమ అడవుల కోసం, అస్థిత్వం కోసం, ఆత్మ గౌరవం కోసం పోరాడుతున్నారు. ఆ పోరాటాల పర్యవసానంగానే వారికి రాజ్యాధికారం దక్కుతుంది. తద్వారానే వారికి నిజమైన గౌరవం సంప్రాప్తిస్తుంది.

మన దేశంలో గద్దెనెక్కిన హిందుత్వ శక్తులు ప్రధానంగా నరేంద్ర మోదీ అండ్ కంపెనీ మేక్ ఇన్ ఇండియా పేరుతో అతి వేగంగా అమూల్యమైన దేశ వనరులను బహుళజాతి కార్పొరేషన్‌లకు, భారత బడా పెట్టుబడిదారీ వర్గాలకు వేలానికి పెడుతున్నారు. ఈ దేశంలోని అత్యధిక ప్రాకృతిక వనరులు అదానీ, అంబానీల పాలవుతున్నాయి. మోదీ గద్దెనెక్కిన తర్వాత ప్రపంచ పెట్టుబడులకు అనుకూలంగా రాజ్యాంగాన్ని, చట్టాలను మారుస్తున్నాడు. నూతన చట్టాలను రూపొందిస్తున్నాడు. ఇటీవల కేంద్రం ముందుకు తెచ్చిన అటవీ సంరక్షణ నియమాలు కానీ, రాజ్యాంగానికి భిన్నంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన పెసా కానీ, మహారాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన

కేటగిరీల వారి పెసా కానీ మూలవాసుల అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, చట్ట ప్రకారం వారి హక్కులను, అధికారాలను హననం చేసేవే తప్ప నిజంగా వారి వికాసానికి ఎంత మాత్రం కావనీ దోపిడీ పాలకులు 'అడవులను కార్పొరేటీకరణ–సైన్యకరణ' చేయడం వ్యక్తం చేస్తున్నది. మరో వైపు వాటికి వ్యతిరేకంగా దిన దినం వెల్లువెత్తుతున్న మూలవాసుల పోరాటలు, అడవులలో 'జల్, జంగల్, జమీన్'పై అధికారం మాదే అంటూ 'మావా నాటే మావా రాజ్' అంటూ చేస్తున్న నినాదాలు వారి పూర్వీకుల పోరాట వారసత్వాన్ని నిలబెడుతూ నిజమైన గౌరవాన్ని పొందే దిశలో పురోగమిస్తున్నాయి. ఆ పోరాటాలకు దేశ ప్రజలంతా అండగా నిలవాలనీ మా పార్టీ పిలుపునిస్తున్నది.

బిర్సా ముండాను మోదీ భగవంతుడిని చేశాడు. ఆ ప్రజావీరుడి పోరాట పరంపరను రూపుమాపడానికి ఆయనను హిందూ దేవుళ్ల జాబితాలో చేర్చడమే బ్రాహ్మణీయ కుట్ర. బిర్సా కొనసాగించిన ఉల్‌గులాన్ (తిరుగుబాటు)ను మోదీ అడ్రస్ లేకుండా చేస్తున్నాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా పోరాడిన పూర్వ ఆదివాసీ వీరులంతా సైన్యాలను నిర్మించుకొని సాయుధ పోరాట మార్గంలో పోరాడి తమ అసువులర్పించిన వీర యోధులు. వారు ఎవరూ దేవుళ్లు కారు. వారు ప్రజావీరులు. ప్రతి ఆదివాసీ తెగ పోరాట నాయకులను గతంలో బ్రిటిష్ పాలకులు వర్తమానంలో వారి వారసులు భారత పాలకులు మట్టుబెడుతున్నారు. పోరాటవీరులను మట్టుబెడుతూ, పోరాట ప్రజలను కటకటాల పాలు చేస్తూ వారి మహిళలపై అమానుషంగా హత్యాచారాలకు పాల్పడుతూ మరోవైపు గౌరవదినాలు పాటించడాన్ని ముక్త కంఠంతో ఖండిద్దాం.

ఝార్ఖండ్‌లోని కుంటి జిల్లాలో ఉలిహాతు గ్రామంలో పేద కుటుంబంలో తండ్రి సుగుణ ముండా, తల్లి కరిమీ హాతూలకు కలగిన ఐదుగురు సంతానంలో బిర్సా ఒకరు. ఆయన బుధవారం పుట్టి ఆదివాసీ సంప్రదాయం ప్రకారం బిర్సాగా పేరు పొందాడు. ఆయన వెట్టి బిగారీ, దికూల దోపిడీకి వ్యతిరేకంగా, క్రైస్తవ మత సంస్థల తప్పుడు ప్రచారాలను, మత మార్పిడులను ఖండిస్తూ, 1894 అటవీ సంరక్షణ చట్టం రద్దు చేయాలనీ, కోర్టులలో న్యాయం లభించాలనీ, పన్నులు కట్టాల్సిన అవసరం లేదనీ 1895లో తిరుగుబాటు ప్రారంభించాడు. ఫలితంగా ఆయన రెండున్నరేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. ఆయన ముండా రాజ్య స్థాపనను కోరుకున్నాడు. ఆయన బ్రిటిష్ ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవడాన్ని 1893 నుండే వ్యతిరేకించాడు. ఆయన 6 వేల మంది స్త్రీ–పురుషులతో గయా ముండా నాయకత్వంలో 1895లో "ముండా సేన"ను నిర్మించుకొని, ప్రశిక్షితులను చేసుకొని సాయుధ పోరు నిర్వహించాడు. ఆయన *"అబుఆ రాజ్ ఎటేజానా, మహారాణి రాజ్ టుండు"* (ముండా రాజ్యం మొదలైంది, మహారాణి రాజ్యం ముగిసింది) అని ప్రకటించాడు. 24 డిసెంబర్ 1899నాడు తిరుగుబాటు ప్రకటించి దోపిడీదారుల రక్తంతో మన భూమి ఎర్రజెండా లాగ ఎరుపెక్కాలని పిలుపునిచ్చాడు. బిర్సా ముండాను 1900 ఫిబ్రవరి 3 నాడు ద్రోహంతో జంకోపాయి అడవులలో అరెస్టు చేసి 9 జూన్, 1900నాడు రాంచీ జైలులో అధికారులు కుట్రపన్ని హత్య చేశారు. కానీ ఆయన ఆశయాలు అమరమైనవి. వాటి పరిపూర్తి కోసం మనం పోరాడాలి.

మన గడ్డ నుండి సామ్రాజ్యవాదులను, దళారీ నిరంకుశ పెట్టుబడులను తన్ని తరుమాలి. ఆదివాసీలను హిందువులుగా మార్చే ప్రక్రియను ఓడించాలి.

ఈ రోజు ఝార్ఖండ్, బిహార్, ఒడిశా, పశ్చిం బెంగాల్‌లలోని సంతాల్ తదితర ఆదివాసీ సోదరులంతా సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నారు. పీడిత ప్రజల బిడ్డలతో నిర్మితమవుతున్న మా పీఎల్‌జీఏ వారి పోరాటాలకు అండగా వుంది. ఆదివాసీ ప్రజా పోరాట వీరుల వారసత్వాన్ని నిలబెడుతూ నిజమైన అధికారం కోసం పీఎల్‌జీఏ నాయకత్వంలో పోరాడుదామనీ బిర్సా ముండా జయంతిరోజు మరోమారు ఆయన వారసులుగా మనం "*జనతన రాజ్ ఎటేజానా, హిందుత్వ రాజ్ టుండు*" అని శపథం చేద్దాం.

Pratap

ప్రతాప్,

అధికార ప్రతినిధి, మధ్య రీజియన్

సీపీఐ (మావోయిస్టు)